క్లుప్తంగా

మహిళలకు చీరలు, బియ్యం పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న పచ్చిరిపల్లి రాము తదితరులు

అల్లిపురం: వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిరిపల్లి రాము బుధవారం 33వ వార్డులోని తన కార్యాలయంలో మహిళలకు బియ్యం, చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు సేవ చేయడమే విధిగా పెట్టుకున్నట్లు తెలిపారు. తన జన్మదినం సందర్భంగా ఆయన ఈ కార్యక్రమం నిర్వహించారు. వార్డు నాయకులు ఎం. రమేష్, పీవీఎస్ రెడ్డి, సూర్య తదితరులు పాల్గొన్నారు.

ఐవోక్యూఎం పరీక్షలో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రభంజనం



ఒలింపియాడ్ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులతో పాఠశాల ప్రతినిధులు

సీతమ్మధార: ఇండియన్ ఒలింపియాడ్ క్వాలిఫయర్ ఇన్ మేథమేటిక్స్ (ఐవోక్యూఎం) జాతీయ గణిత పరీక్షలో శ్రీ చైతన్య టెక్నో పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈ మేరకు ద్వారకానగర్‌లో గల పాఠశాలలో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉత్తరాంధ్ర ఏజీఎం ఎం.వి.సురేష్ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఆర్.ఐ. మహ్మద్ అలీ, జోనల్ కో–ఆర్డినేటర్ రాజేష్ కూడా విద్యార్థులను అభినందించారు. ఈ పరీక్షకు మొత్తం 39మంది విద్యార్థులు హాజరు కాగా, వీరిలో 14 మంది విద్యార్థులు రెండో స్థాయికి అర్హత సాధించారని ప్రిన్సిపాల్ రవికిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యా సంస్థల డీన్ సురేష్, గౌరినాయుడు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్–3 పరిధి 24, 26 వార్డుల్లో ఈ నెల 25న తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజినీరు టీఎల్ సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీతమ్మధార టీపీటీ కాలనీ ప్రాంతంలో 400 ఎంఎం వ్యాసం గల మంచినీటి సరఫరా పైపులైన్ మరమ్మతులకు గురైనందున శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జోన్–3 పరిధి 24వ వార్డు టీపీటీ కాలనీ, పీ అండ్ టీ కాలనీ, నక్కవానిపాలెం, గాంధీనగర్, చైతన్యనగర్, క్రాంతినగర్, శారదా స్కూల్ ప్రాంతం, 26వ వార్డు పరిధిలో రామకృష్ణానగర్, లలితానగర్, శంకరమఠం మెయిన్‌రోడ్డు, చిన్మూరు, మంగళ వీధి తదితర ప్రాంతాల్లో తాగునీటికి అంతరాయం కలగనుందని తెలిపారు. ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా జరుగుతుందని, అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని పేర్కొన్నారు.

27న ఉచిత వైద్యశిబిరం

మురళీనగర్ : మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అపోలో ఆస్పత్రి సహకారంతో స్థానిక వాకర్స్ పార్కులో ఈ నెల 27 ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తామని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ టి.రవికాంత్, దంత వైద్య నిపుణుడు డాక్టర్ గిరీష్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ధీరజ్ పత్రి పాల్గొంటారని చెప్పారు. శిబిరంలో సాధారణ వ్యాధులతోపాటు, గుండె, దంత సబంధిత సమస్యలకు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఆ రోజు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బీపీ, సుగర్, ఈసీజీ పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. మురళీనగర్ పరిసర ప్రాంతవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బంగారు బాల్యానికి.. ఏదీ అండ?

ఐదేళ్లు వచ్చే వరకు వీధుల్లో ఆటపాటలతో కాలక్షేపం

- ఐదేళ్లు దాటితే చిన్నా చితకా పనులు
- ఎక్కువగా మురికివాడ ప్రాంతాల్లోనే నిరక్షరాస్యులు

నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో **బాలలు విద్యకు దూరంగా** గడుపుతున్నారు. కేవలం ఆటపా**టలతో కాలక్షేపం చేయడం..** ఊహ వచ్చిన తర్వాత తల్లిదండ్రు**లకు పనిలో సాయంగా ఉంటూ** నాలుగు రూపాయలు సంపాదిం**ది కన్నవారికి ఇస్తూ రోజులు** వెళ్లదీస్తున్నారు. దీని వల్ల వారు **బంగారు బాల్యం** కోల్పోతున్నారు. చిన్నతనం నుం**డే ఆటుపోట్లను** చవిచూడడంతో రాటు దేలి నేర**ప్రవృత్తికి దగ్గరవుతున్నారు.**



దాబాగార్డెన్స్: పాతనగరంలో ఉన్న పలు మురికివాడల్లోని పిల్లలు విద్యకు దూరంగా ఉన్నారు. అలాగే సంచార జీవితం గడిపే కుటుంబాలకు చెందిన బాలలు కూడా బడి బాట లేకుండా జీవితం గడుపుతున్నారు. ఐదేళ్ల వయసు వచ్చే వరకూ వీధుల్లో ఆటపాటలతో కాలక్షేపం చేస్తున్నారు. ఐదేళ్లు దాటితే చిన్నా చితకా పనులు, పాచిపని, చేపలు పట్టే పనుల్లో తల్లిదండ్రులకు సహకరిస్తున్నారు.



ఫెర్రీరోడ్డు వద్ద ఆడుకుంటున్న చిన్నారులు

బడికి కాదు.. పనికి..

దక్షిణ నియోజకవర్గంలోని వెనుకబడిన ప్రాంతాల్లో **చాలా మంది తల్లి**దండ్రులు తమ పిల్లలకు ఊహ **వచ్చిన తర్వాత** బడికి పంపడం కన్నా ఏదో ఒక **పనిలో పెట్టడం** కనిపిస్తుంది. కిరాణా దుకాణాలు, **పకోడీ బళ్ల వద్ద**, నూడిల్స్ దుకాణాల వద్ద **హెల్పర్లుగా పనికి** కుదిర్చి వారు తెచ్చిన కొద్దో **గొప్పో రుసుమును** వాడుకోవడం పరిపాటి. ఇలా **బాల్యాన్ని కోల్పో**తున్న బాలల విషయంలో **ప్రభుత్వం, స్వచ్ఛంద** సంస్థలు అంతగా పట్టించుకో**వడం లేదు. దీంతో** సుమారు రెండు వందల మం**ది చిన్నారులు** బాల కార్మికులుగా అవతారం **ఎత్తి చిన్నతనం** నుంచే బతుకు బండి లాగి**స్తున్నారు.** రోడ్ల మీద, మురుగు కాలు వల్లో **పనికి** వచ్చే వస్తువులు తల్లిదండ్రులతో **పాటు** వెళ్లి సేకరిస్తున్నారు. ఇలా వెళ్లే **చిన్నారులు** ఆధిపత్య పో రు కోసం **తరచూ** గొడవ పడడం ఈ ప్రాంతంలో **సర్వసాధారణం**గా కనిపిస్తుంది.

అక్షరాస్యత పెరగాలి..

నగరంలో అనేక మురికి వాడలను **ప్రభుత్వం** లెక్కతేల్చిన నేపథ్యంలో **అక్షరాస్యత**ను ఈ వాడల్లో పెంచాల్సిన **ఆవశ్యకత** ఎంతో ఉంది. నగరాన్ని **స్మార్ట్ సిటీ**గా పరిగణించిన నేపథ్యంలో **ప్రథమంగా మురికివాడ**ల్లో అక్షరాస్యతను పెంచే దిశగా **అధికారులు తగిన చర్యలు** చేపట్టాల్సి ఉంది. అంతే కాక **వీధి బాలల సంరక్షణ సంస్థలు** ప్రత్యేక దృష్టి పెట్టి అమూల్య **బాల్యానికి అండగా నిలవాల**ని పలువురు కోరుతున్నారు.



చెత్త కాగితాలు ఏరుతున్న చిన్నారులు

అవలక్షణాల అలవాటు..

చిన్నతనంలోనే పనికి వెళ్లే బాలలు అవలక్షణాల బారిన పడుతున్నారు. చదువుకోవడానికి బడికి వెళ్లకుండా తల్లిదండ్రులు కుదిర్చే ఏదో ఒక పనిలో చేరి జీవితం గడిపే పిల్లలు త్వరగా చెడు అలవాట్లకు బానిసలవుతున్నారు. తండ్రితో పాటు మద్యం దుకాణానికి వెళ్లి మద్యం సేవించే సంఘటనలు కూడా పెరుగుతున్నాయి. ఈ వ్యవహారాలు పాతనగరంలో ఉన్న జాలారిపేట, రెల్లివీధి, ఫెర్రీరోడ్డు, చిలకపేట, పద్మానగర్, కొబ్బరితోట, కల్లుపాకలు తదితర ప్రాంతాల్లోని మురికివాడల్లో నిత్యం మనకు కనిపిస్తుంటాయి.

పెరుగుతున్న నేర స్వభావం..

తల్లిదండ్రుల ఆలనా పాలనకు నోచుకోకుండా, చిన్నతనంలోనే పనులు చేసే పిల్లల్లో నేరస్వభావం మిగతా పిల్లల కంటే ఒకింత ఎక్కువగా ఉంటుంది. ఉదయం నుండి రాత్రి వరకు ఏదో ఒక చోట పని చేయడం, రోడ్ల మీద కాగితాలు, ప్లాస్టిక్ వస్తువులు ఏరి విక్రయించడం వంటి పనులు చేసే బాలల మనసిక స్థితి సాధారణ బాలల కన్నా భిన్నంగా ఉంటుందని అధ్యయనకారులు చెబుతున్నారు.

పేద కుటుంబానికి వాసుపల్లి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న వాసుపల్లి

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 39వ వార్డుకి చెందిన కదిరి అప్పారావు కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆశీల్‌మెట్ట అశోక్‌నగర్‌లో గల తన కార్యాలయంలో బుధవారం తన సొంత నిధుల నుంచి ఆర్థిక సాయం అందజేశారు. కదిరి అప్పారావు మాతృమూర్తి కదిరి కల్యాణి ఇటీవల మరణించడంతో వర్ధంతి ఖర్చుల కోసం ఈ ఆర్థిక సాయాన్ని వాసుపల్లి అందజేశారు. నియోజకవర్గ ప్రజలతో తనది విడదీయరాని బంధమని, వారి కష్టాలు తనవిగా భావించి తన వంతు సాయంగా ఆర్థిక సాయం అందజేసినట్టు వాసుపల్లి తెలిపారు. కార్యక్రమంలో కదిరి కల్యాణి బంధువులు, పార్టీ నాయకులు చింతకాయల వాసు, ఆకుల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల కౌన్సిల్ స్పోక్స్‌పర్సన్‌గా ఆల్ఫా కృష్ణ

దాబాగార్డెన్స్: వినియోగదారుల కౌన్సిల్ సభ్యుల సమావేశం బుధవారం నగరంలోని ఓ హోటల్లో వినియోగదారుల కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వికాస్ పాండే అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో కౌన్సిల్ స్పోక్స్ పర్సన్‌గా బి. సన్నికృష్ణ (ఆల్ఫా కృష్ణ)ను నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వికాస్‌పాండే మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో టీమ్స్ ద్వారా వినియోగదారులకు వారి హక్కుల గురించి అవగాహన కార్యక్రమాలు, వినియోగదారులకు జరుగుతున్న మోసాల గురించి న్యాయస్థానాల ద్వారా న్యాయం జరిగేలా తోడ్పాటు అందిస్తున్నట్టు తెలిపారు. ఆల్ఫా కృష్ణ మాట్లాడుతూ నేషనల్ స్పోక్స్‌పర్సన్‌గా నియమించిన వికాస్ పాండేకు కృతజ్ఞతలు తెలిపారు. వినియోగదారుల హక్కులు, వారికి జరుగుతున్న మోసాల గురించి అవగాహన కార్యక్రమాల్లో భాగస్వామినై తన వంతుగా కృషిగా చేస్తానన్నారు. కార్యక్రమంలో నగర సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



వికాస్‌పాండే నుంచి నియామక పత్రం అందుకుంటున్న ఆల్ఫా కృష్ణ

ఆస్తి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: ఆస్తి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలని జెడ్సీ ఎం.మల్లయ్యనాయుడు అన్నారు. బుధవారం ఆయన సూర్యాబాగ్ జోనల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, సెక్రటరీలు, ట్యాక్స్ కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుల్లో ఉన్న సచివాలయాల పరిధిలో సెక్రటరీలు, ఆర్ఐలు నిర్ణయించిన టార్గెట్లను తీసుకుని ఆస్తిపన్ను, నీటిపన్ను వసూలు చేసి జీవీఎంసీకి ఆదాయం పెంచాలన్నారు. పాతబకాయిలు, మొండిబకాయిదారులకు నోటీలు జారీ చేయాలన్నారు. అప్పటికీ చెల్లించని పక్షంలో ఆస్తి జప్తు నోటీసులు జారీ చేయాలన్నారు. అలాగే పన్ను చెల్లించే వారి నుంచి చెక్కులు తీసుకోకుండా కమిషనర్ జీవీఎంసీ పేరుతో డీడీలు తీసుకోవాలన్నారు. గతంలో చెక్కులు ఇచ్చి ఇప్పటికీ పన్నులు చెల్లించని వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. సెక్రటరీలు, ట్యాక్స్ కలెక్టర్లను ఆర్వోలు, ఆర్ఐలు కోఆర్డినేషన్ చేసుకుని వసూలు చేయాలన్నారు. షాపింగ్ మాల్స్, కళాశాలలు, అపార్టుమెంట్లు, ఖాళీగా ఉన్న ఇంటి స్థలాలు నుంచి పన్ను వసూలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంతో ఆర్వోలు, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

దాబాగార్డెన్స్: మల్కాపురం ప్రాంతానికి చెందిన తన భర్త దుర్గాప్రసాద్ ఈ నెల 11 నుంచి కనిపించడం లేదని జి. నీలిమ బుధవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాలివి. మల్కాపురం ప్రాంతానికి చెందిన దుర్గాప్రసాద్ తన కుమార్తె కృప అనారోగ్య కారణంగా ఈ నెల 2న కేజీహెచ్‌లో జాయిన్ చేయించారని, చికిత్స అనంతరం ఈ నెల 11న డిశ్చార్జి ఇచ్చారని తెలిపింది. డిశ్చార్జి సమయంలో పాపను ఇంటికి తీసుకెళ్లమని, తాను వస్తానని చెప్పిన దుర్గాప్రసాద్ ఇంటికి చేరుకోకపోవడంతో ఆచూకీ కోసం పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ దొరకలేదని, బంధువులను కూడా సంప్రదించినా ఫలితం లేకపోయిందని తెలిపింది. ఈ నెల 13న భర్త ఫోన్‌కు ఎంత ట్రై చేసినా స్విచ్ ఆఫ్ రావడంతో అప్పటి నుంచి ఆచూకీ కోసం వెతకుతున్నట్లు తెలిపింది. పది రోజులైనా భర్త ఆచూకీ లేకపోవడంతో బుధవారం వన్‌టౌన్ పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. తన భర్త వయసు 37 ఏళ్లని, చామనఛాయిగా ఉంటారని, ఐదు అడుగుల ఎత్తు, రెండు చేతుల మీద టాటూస్ ఉంటాయని తెలిపింది.



దుర్గాప్రసాద్ (ఫైల్)


రోడ్డుపైనే దుకాణాలతో ట్రాఫిక్ అవస్థలు

సీతమ్మధార : స్థానిక రైతుబజార్ రోడ్డుపై దుకాణాల ఏర్పాటుతో రాకపోకలకు మార్గం కుంచించుకుపోతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీతమ్మధార నుంచి తూర్పు వైపునకు వెళ్లే రోడ్డు నిత్యం ట్రాఫిక్‌జామ్‌తో పాదచారులు, వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డును ఆక్రమించి నిమ్మకాయలు, పండ్లు, కొబ్బరికాయులు, పూజా సామగ్రి విక్రయించే దుకాణాలు ఏర్పాటు చేశారు. దీంతో రాకపోకలకు అవకాశం లేక నిత్యం ట్రాఫిక్‌జామ్ అవుతోంది. ఈ రోడ్డులోనే జిల్లా మహిళా శిశు అభివృద్ధి సంస్థ ఉద్యోగుల వసతి గృహం కూడా వుంది. దీంతో వసతిగృహం సిబ్బంది, ఉద్యోగినులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడి నుంచి కేఆర్ఎం కాలనీ, మద్దిలపాలెం, ఎంటీసీ కాలనీకి వెళ్లేందుకు వందలాది మంది రాకపోకలు సాగిస్తారు. దుకాణాల వద్ద వాహనాలు ఆపి కొనుగోలు చేసే సమయంలో ఈ రోడ్డంతా హారన్ల మోతతో దద్దరిల్లిపోతుందంటే అతిశయోక్తి కాదు. రైతుబజార్‌కి వచ్చే వినియోగదారులు తమ వాహనాలను ఈ రోడ్డులోనే పార్కింగ్ చేస్తారు. పైగా రోడ్డుకి రెండువైపులా తోపుడుబండ్లు కూడా అధిక సంఖ్యలో ఉంటాయి. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు స్పందించి ఈ మార్గంలో ఆక్రమణలు తొలగించి, వాహనాల రాకపోకలకు మార్గం సుగుమం చేయాలని పలువురు కోరుతున్నారు.



దుకాణాల ఆక్రమణతో కుంచించుకుపోయిన రైతుబజార్ రోడ్డు

ఎమ్మెల్యే సారూ.. సమస్యలు పరిష్కరించరూ!



విశాఖ దక్షిణ నియోజకవర్గం

దాబాగార్డెన్స్: ఎమ్మెల్యే సారూ.. మేము విశాఖ దక్షిణ నియోజకవర్గం ప్రజలం. ఇక్కడ వందేళ్లకు పైబడిన భవనాలు.. మత్స్యకార కుగ్రామం.. ప్రభుత్వ కార్యాలయాలు.. హిందూ.. ముస్లిం.. క్రిస్టియన్ ఒక్కటే అన్నట్టు మూడు కొండలపై వేంకటేశ్వరస్వామి, కొండ గుడి మేరీమాత, దర్గా ఉన్నాయి. నగరం విస్తరించడంతో పాతనగరం అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. సమస్యలు పరిష్కరించే ప్రజాప్రతినిధులు కరవయ్యారు. అధికారంలో ఉన్నంత వరకూ ఏవేవో ప్రకటనలు గుప్పించడం పదవి పోయిన తర్వాత ఆ సమస్య అలాగే మిగిలిపోవడం.. ఇలా గత కొన్ని దశాబ్దాలుగా జరుగుతోంది. ఈ నియోజకవర్గం ఎంతో మంది ప్రజాప్రతినిధులను చూసింది. కానీ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు మాత్రం అలానే మిగిలిపోతున్నాయి. నియోజకవర్గ ప్రధాన సమస్యల పరిష్కారానికి గత ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అప్పటి ముఖ్యమంత్రి కార్యదర్శి కాల్వ ధనుంజయరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఒక్కొక్కటిగా ఆ సమస్యలు అప్పటి ప్రభుత్వం పరిష్కరిస్తూ వచ్చింది. ఇంతలో ప్రభుత్వం మారింది. అంతే.. సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదు.

ప్రధాన సమస్యలివే..

- 30వ వార్డు పరిధి అంగటిదిబ్బలో 2.50 ఎకరాల స్థలంలో నివాసముంటున్న సుమారు 500 కుటుంబాలకు పైగా శాశ్వత పట్టాలు మంజూరు చేసి, ముస్లిం స్మశాన వాటికకు మధురవాడ ప్రాంతంలో 10 ఎకరాల స్థలం కేటాయించాలి. ఈ కేటాయింపు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని కూటమి ప్రభుత్వం రాకముందు అప్పటి ముఖ్య మంత్రి కార్యదర్శికి వాసుపల్లి విజ్ఞప్తి చేశారు.
- పోర్టు కాలుష్యం పూర్తిగా నివారించేందుకు (ఐరన్ ఓర్, జిప్సమ్, సల్ఫర్, ఫెర్టిలైజర్స్, అల్యూమినా, కెమికల్ పౌడర్స్ వంటి హానికరమైనవి ప్రబలకుండా) శాశ్వత పరిష్కారం కోసం పర్మినెంట్ షెడ్స్ నిర్మాణం చేసి పొల్యూషన్‌కి గురవుతున్న దక్షిణ నియోజకవర్గ ప్రజలను కాపాడాలని కోరారు. ఇంతకు ముందు ఎమ్మెల్యే చొరవతో లక్షల సంఖ్యలో మొక్కలు నాటడం, 20 అడుగుల పైబడి ప్రహరీ నిర్మాణం చేపట్టడం ద్వారా కొంత వరకు పొల్యూషన్‌ను నివారించినప్పటికీ, పొల్యూషన్ మోనిటరింగ్ సెంటర్స్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పొల్యూషన్‌ను నివారిస్తూ, వైద్య శిబిరాలను పోర్టు యాజమాన్యం చేపట్టింది. ఈ షెడ్స్ నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన చేపట్టినట్టయితే సుమారుగా 4 లక్షల మంది ఆరోగ్యాలు కాపాడుకోవచ్చని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అప్పటి సీఎం కార్యదర్శికి వివరించారు.
- 38వ వార్డు పరిధి రీడింగ్ రూమ్/కనకమహాలక్ష్మి ఆలయ ప్రధాన ఆర్చి నుంచి బీచ్ రోడ్డు వరకు వయా ఘోషా ఆసుపత్రి వద్ద 60 అడుగుల రోడ్డు విస్తరణ చేపట్టాల్సి ఉంది. ఘోషాసుపత్రికి నిత్యం 20 నుంచి 30 డెలివరీ కేసులు వస్తుంటాయి. ఆస్పత్రికి వెళ్లే మార్గం చాలా చిన్నదిగా ఉండడం వల్ల చాలా ప్రసవాలు ఆటోలోనే జరిగిపోయి తల్లీ బిడ్డకు ప్రాణహాని జరిగిన సందర్భాలు ఉన్నాయి. ఈ రోడ్డు విస్తరణ వల్ల సుమారు 8 వేల కుటుంబాలు (40 వేల మంది ప్రజలకు), అంతే కాక విశాఖపట్నం నలుమూలల నుంచి ప్రసవం కోసం వస్తున్న వేలాది మంది గర్భిణులకు ప్రయోజనం చేకూరుతుంది.
- నియోజకవర్గ పరిధి 33వ వార్డు ఏరియాలో వేంకటేశ్వరమెట్ట, 31వ వార్డు యల్లమ్మతోట ప్రాంతాల్లో నివాస గృహాల సమస్య పరిష్కారం చేయాలి. వేంకటేశ్వరమెట్ట ప్రాంతంలో సుమారు 150 ఏళ్లుగా 500 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఆ గృహాలకు సంబంధించి క్రయ, విక్రయ, గిఫ్ట్ డీడ్స్ రిజిస్ట్రేషన్లకు ఎటువంటి ఇబ్బంది ఉండేది కాదు. అయితే 2003లో అప్పటి ఈవో, చైర్మన్, స్థానికుల మధ్య నెలకొన్న వివాదం కారణంగా ఆయా గృహాల స్థలం దేవదాయ శాఖకు చెందినదంటూ.. వాటిపై ఎటువంటి రిజిస్ట్రేషన్లు చేయవద్దంటూ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి లేఖ రాయడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిచిపోయింది. 2018 నుంచి 2021 వరకు 53 గృహాలకు అప్పటి ఎమ్మెల్యే వాసుపల్లి ప్రయత్నాల నేపథ్యంలో రిజిస్ట్రేషన్లు జరిగాయి. అయితే మరలా దేవదాయ శాఖ మెలిక పెట్టడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మళ్లీ నిలిచిపోయింది. దీంతో ఆయా గృహాలపై లోన్లు రాకపోవడంతో పిల్లల విద్యా, ఉద్యోగ, వ్యాపార అవసరాలకు ఇబ్బంది పడతున్నారు. అలాగే యల్లమ్మతోట ప్రాంతంలో 90 ఏళ్లుగా చాలా కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వారి ఇళ్లకు సంబంధించి కూడా దేవదాయ శాఖ మెలిక పెట్టింది. వెంటనే ఆయా సమస్యలపై చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి. పనులన్నీ పరిష్కారమయ్యే స్థాయికి వచ్చాయి. ఇంతలో ఎన్నికలు రావడం.. ఆ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం విజయం సాధించడంతో దక్షిణ నియోజకవర్గ సమస్యలు మళ్లీ మొదటికి వచ్చినట్టయింది. కావున తమరు దక్షిణ నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా నిలిచిపోయిన, ప్రస్తుతం ఎదుర్కొంటున్న అనేక సమస్యలు పరిష్కరించాల్సి ఉందని దక్షిణ నియోజకవర్గం ప్రజలు కోరుతున్నారు.

మరో రెండు రోజులు ఆధార్ ప్రత్యేక శిబిరం



పాత రేసపువానిపాలెం సచివాలయంలో ఆధార్ వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

సీతమ్మధార : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంపిక చేసిన సచివాలయాల్లో ఆధార్ వివరాల నమోదు, సవరణ చురుగ్గా జరుగుతోంది. సచివాలయాల్లో మంగళవారం ప్రారంభించిన ప్రత్యేక శిబిరాలు మరో రెండు రోజులపాటు కొనసాగుతాయి. ఈ మేరకు ఉత్తర నియోజకవర్గంలోని సీతమ్మధార సచివాలయంలో, 24వ వార్డు పాత రేసపువానిపాలెంలో గల 138వ నంబరు సచివాలయంలో రెండు రోజులుగా ఆధార్ సేవలు అందిస్తున్నారు. ఏడేళ్లలోపు పిల్లలకు పూర్తి ఉచితంగా వివరాలు నమోదు చేస్తున్నారు. ఇతరులు మాత్రం రూ.50 చెల్లించాల్సి ఉంటుంది. ఈ కేంద్రాల్లో రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు వరకు ఆధార్ నమోదు ప్రక్రియ జరుగుతుంది. ఆధార్ బయోమెట్రిక్ పెండింగ్‌లో ఉన్నవారంతా విధిగా సమీపంలోని సచివాలయంలో నమోదు చేసుకోవాలని జోన్ – 3 కమిషనర్ కె.శివప్రసాద్ కోరారు.

అణుశక్తిపై పాఠశాల విద్యార్థులకు అవగాహన

ఎంవీపీకాలనీ: అణుశక్తిపై పాఠశాల స్థాయి విద్యార్థులకు అవగాహన కల్పించారు. న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, ఎగ్జికాన్ ఈవెంట్స్ మీడియా సొల్యూషన్స్ లిమిటెడ్ సంయుక్తంగా బుధవారం ఈ కార్యక్రమం నిర్వహించాయి. ది పవర్ ఛాంప్స్ పేరిట ఎంవీపీ కాలనీ, సీతమ్మధార ప్రాంతాల్లోని పలు పాఠశాలల్లో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అణుశక్తి ఉత్పత్తి, దాని సామర్థ్యం, వినియోగంతోపాటు సమస్యలను విద్యార్థులకు తెలియజేశారు. దేశంలో ఇంధనం భవిష్యత్ వినియోగం, ఉత్పత్తి సవాళ్లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయా అంశాల్లో, పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల సామాజిక బాధ్యతను వివరించారు. ఆయా పాఠశాలలకు చెందిన వెయ్యి మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ అంశంపై నిర్వహించిన అవగాహన చర్చలు, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొన్నారు. ఆయా సంస్థల ప్రతినిధులతోపాటు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహిస్తున్న సంస్థ ప్రతినిధులు

సౌర విద్యుత్‌తోనే భవిష్యత్

సీతమ్మధార : ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో మొట్టమొదటి రూఫ్‌టాప్ సోలార్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఫ్రేయర్ ఎనర్జీ సంస్థ సీతమ్మధార కేఎస్ఆర్ ప్లాజాలో ఏర్పాటు చేసింది. ఈ సెంటర్‌ను విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సంస్థ ఏర్పాటు పర్యావరణ అనుకూల, స్వచ్ఛమైన ఇంధనాన్ని స్వీకరించడానికి ఒక ముందడుగుగా నిలుస్తుందన్నారు. సౌర విద్యుత్‌పై ఆధారపడిన వ్యాపారాలను బలోపేతం చేయడంతోపాటు హరిత భవిష్యత్‌కు దోహదపడుతుందని కొనియాడారు. ఈ కేంద్రం మరింత పర్యావరణ అనుకూల భవిష్యత్ కోసం అందరినీ ప్రేరేపిస్తుందన్నారు. కార్యక్రమంలో ఫ్రేయర్ ఎనర్జీ మేనేజింగ్ డైరెక్టర్ సౌరభ్ మర్దా, డైరెక్టర్ రాధిక చౌదరి పాల్గొన్నారు.

విదేశీ విద్యార్థుల హాస్టల్ సందర్శన

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం విదేశీ విద్యార్థుల హాస్టల్‌ను బుధవారం మధ్యాహ్నం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనంజయరావు సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్స్‌లో కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులను అడిగి ఆయన తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి అక్కడే భోజనం చేశారు. ఏయూ పూర్తి స్థాయిలో విద్యార్థులకు సహకారం అందిస్తూ పరిపాలన సాగిస్తోందని చెప్పారు. విద్యార్థులకు ఎటువంటి సహాయం అవసరమైన వెంటనే తమను సంప్రదించాలని సూచించారు. ఇటీవల కాలంలో హాస్టల్స్‌లో చేపట్టిన మరమ్మతులు, నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాలను చీఫ్ వార్డెన్ డాక్టర్ ఎస్.ఎం.యుగంధర్ వివరించా రు. హాస్టల్ అభివృద్ధికి అవసరమైన సంపూర్ణ సహ కారాన్ని సత్వరమే అందిస్తామని రిజిస్ట్రార్ తెలిపారు. అకడమిక్ డీన్ ఆచార్య కె.ఈశ్వర్‌కుమార్, దూర విద్య సంచాలకుడు ఆచార్య ఎస్.విజయమోహన్, డీసీఎంఎస్ విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, డాక్టర్ సీహెచ్ ఆశ, ఇమ్మానియల్ రాజు తదితరులు పాల్గొన్నారు.



ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది